
'రచన' మాసపత్రిక - ఏప్రిల్ 1992

# కథ ప్రహేళిక -5



## గడువు

వేమన వచ్చి నా కాళ్ళ మీద పడ్డాడు. "ఏంటయ్యా" అని అడిగాను. మామూలే! మాట్లాడడు. చిట్టచివరికి చెప్పాడు - అతన్ని భార్య వదిలేస్తోందిట. నాకు ఆశ్చర్యమూ, బాధా కలిగాయి. దగ్గర కూర్చోబెట్టుకుని బుజ్జగించాను.

మా ఆఫీసులో ఈ వేమన చేరి రెండేళ్ళయ్యింది. నా కింద వేసారు. అతనిది భద్రాచలం దగ్గర ఏదో ఊరు. ఐ.ఐ.టి. పాసయాడు. ట్రేసర్‌గా తీసుకున్నాం. అతనికి ఏ పనీ సవ్యంగా వచ్చేది కాదు. తతిమా స్టాఫు అతన్ని ఆటలు పట్టించేవారు. నేను అందర్నీ పిలిచి గట్టిగా వార్నింగ్ ఇచ్చాను. దాంతో వాళ్ళు తగ్గిపోయారు. వేమనకు నేనంటే గురి ఏర్పడింది. ఏ పని చెయ్యాలన్నా నేనే చెప్పాలి. వేమన అడవి మనిషని మిగిలిన వాళ్ళు అనేవారు. 'అందుకే మనలా మాయో మోసమూ చేతకావటం లేదు'. - అనేవాడిని. వేమనకు ఓ అలవాటుండేది. పొద్దుటే కల్లు తాగాలి. మా ఆఫీసుకు దగ్గర్లోనే ఓ గుట్ట ఉండేది. ఆ అవతల ఒక ఊరు ఉండేది. అంతా విశాఖపట్నంలోనే అయినా ఊరు



కొసన ఉండడం వల్ల తాటిచెట్లూ, పొలాలూ ఉండేవి. ఒక తాటి చెట్టు నుంచి కల్లు తీయించుకొని తాగి ఆఫీసుకు వచ్చేవాడు. అది ఎవరో మా బాసుకి చెప్పారు. ఆయన దాన్ని పట్టుకుని వేమనను ఉద్యోగం నుంచి తొలగిస్తానని కూర్చున్నాడు. నేను వేమనను అడిగాను. 'నిజమే' అన్నాడు. చిన్నతనం నుంచీ వాళ్ళ పల్లెల్లో అలవాటు చేసారట.

మానతావా అన్నాను. మానతనన్నాడు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఉద్యోగం తీసేస్తారు- ఏం చేస్తావని అడిగాను. వాళ్ళ పల్లె పోతానన్నాడు. అప్పుడు మా బాసు దగ్గరికి వెళ్ళాను. 'అతనేం అల్లరి చిల్లరగా మాట్లాడడం లేదు. చెప్పిన పని చేస్తున్నాడు' అంటూ మొదలెట్టాను. అదేం అలవాటన్నాడాయన. 'అలవాట్లు పుట్టుకని బట్టి వస్తాయి. మనకి అది తాగడం. అతనికి అది తిండి లాంటిది. మనం నాగరికులమని వాళ్ళను లోకువ చేస్తాం - మనలా ఎందుకుండాలి వాళ్ళు? విశాఖపట్నంలో గవర్నమెంటు ఆఫీసులో పనిచేస్తున్నాడు కనుక మనలా ఉండాలి అనుకుంటాం! కాండక్ట్ రూల్స్ మనని దృష్టిలో పెట్టుకుని చేసినవి. నిజమే - రూల్స్ ప్రకారం అతన్ని మీరు పనిష్ చెయ్యొచ్చు. కాని ఆ అమాయకుడి పొట్ట కొట్టడం మాత్రం తగదు. మీరూ ఆలోచించండి!' అన్నాను. ఆయన ఏ కళనున్నాడో ఏమో తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

వేమన క్రమంగా కొంచెం మాట్లాడ్డం నేర్చుకున్నాడు. ఏడాది క్రితం అతనికి పెళ్ళయింది. మా వాళ్ళంతా పార్టీ యిమ్మన్నారు. నేను వేమనకు నచ్చచెప్పి వాళ్ళిద్దరినీ మా యింటికి తీసుకు వచ్చి పార్టీ ఏర్పాటు చేసాను. మా ఆవిడా, పిల్లలూ వాళ్ళను పట్టుకుని వదలలేదు. ఆ అమ్మాయి మరీ వేమనలా కాదు. ఒకటీ అరా మాట్లాడేది. భార్యాభర్తా యిద్దరూ చక్కగా ఆరోగ్యంగా, చూడముచ్చటగా ఉండేవారు. వాళ్లిద్దరి అమాయకత్వం చూసి నిత్యావసర వస్తువులు ఎలా కొనుక్కుంటున్నారోననిపించేది. అన్ని చోట్లా వాళ్లకి ఖాతాలు ఏర్పాటు చేసాను.

అలాంటి వేమనను భార్య వదిలేస్తోందా?

ఎందుకు?

పిల్ల తల్లీ తండ్రీ తగువు పెడుతున్నారుట. వెంటనే వాళ్ళ ఊరు రమ్మని కార్డు రాసారుట. నన్ను కూడా రమ్మన్నాడు వేమన. ఆ పిల్లని కలిసాను. వేమన చెప్పింది నిజమే! తనూ మొగుడూ విడిపోక తప్పదట. తనకి విడిపోవాలని లేదని ఏడిచింది. మీ యిద్దరికీ యిష్టమయితే మిమ్మల్నెవరు విడదీస్తారన్నాను. వాళ్ళు తల్లితండ్రులూ, తెగ పెద్దలూ అంతా కలిసి విడదీస్తారంది. మమ్మల్ని మీరే రక్షించాలని, వేమనా, భార్యా దణ్ణాలు పెట్టారు. మీరు ఊరు వెళ్ళకండి - అన్నాను. వాళ్ళ దేవత శపిస్తుందట. ఎందుకు మిమ్మల్ని విడదీస్తారంటే - వాళ్ళకింకా పిల్లలు పుట్టలేదుట! ఏడాది లోగా పిల్లలు పుట్టకపోతే విడదీసేస్తారుట! కనీసం నెలయినా తప్పాలిట.

నాకు నవ్వొచ్చింది. ఆశ్చర్యం కలిగింది.

చివరికి వాళ్ళని తీసుకుని బయల్దేరాను. బయల్దేరే ముందు యిద్దరినీ డాక్టర్లకి చూపించాను. డాక్టర్లు పరీక్షలన్నీ చేసారు. అన్నీ సవ్యంగానే ఉన్నాయన్నారు. కొద్దిగా

స్పెర్మ్ కౌంట్ తక్కువుందని మందులు యిచ్చారు. వాళ్ళ మందు చీటీలు కూడా పట్టుకుని బయల్దేరాను. సీలేరు మీద నుంచి ప్రయాణం. బస్సులో భద్రాచలం చేరుకున్నాం. అక్కడ నుంచీ ఆ వూరు చేరాం! వేమనను చూసి వాళ్ళ నాన్న కూడా యిలా గంటకో ముక్క మాట్లాడతాడనుకున్నాను. వేమన కూడా ఆ వూరు వెళ్ళేసరికి మారిపోయారు.

ఊరంతా నాకు బ్రహ్మరథం పట్టింది.

వేమన వాళ్ళ తండ్రి కూడా అక్కడికి దగ్గర్లోనే ఉన్నా ఫారెస్టు డిపార్టుమెంటులో నౌఖరుగా పనిచేస్తున్నాడు. ఊరంతా చూపించాడు.

నేను అతన్ని మాటలలో పెట్టాను.

"వేమనా పెళ్ళామూ ఎంతో యిష్టంగా ఉంటున్నారు. మేం విడిపోమని గొడవ చేస్తున్నారు. మీరు విడిపోవాలంటున్నారుట. ఏమిటి సంగతి?" అని అడిగాను.

"మమ్మల్నేం చెయ్యమంటావు? మా తెగకి దేవత శాపం పెట్టింది" అన్నాడాయన.

దానికి వెనుక ఓ కథ చెప్పుకొచ్చాడు.

"ఈ ఊరు యిప్పుడిక్కడుందిగాని అబ్బాయా! ఒహప్పుడు ఆ గెడ్డవతలుండేది. గెడ్డవతల పొలాలు దున్నుతుంటే యిప్పటికీ చిల్లపెంకులు దొరుకుతాయి.

ఇప్పుడంటే దిబ్బయిపోయిందంతా! ఆ రోజుల్లో ఆ గెడ్డకి అవతల ఓ పెద్ద కోట ఉండేది. ఇప్పుడక్కడ ఒక దిబ్బ ఉందంతే! ఆ కోటలో రాజులుండేవారు. ధరమం అంటే వాళ్ళదే ధరమం! దానమంటే వాళ్లదే దానం! పగవాడొచ్చి చెయ్యి జాచి అడిగితే నీ చెయ్యి కిందయింది, నా చెయ్యి మీదయింది. తీసుకో తల! అని తెగనరుక్కుని యిచ్చేవారు.

పౌరుషమంటే ఆ రాజుల్దే పౌరుషం! పరాసు దొరలొచ్చి డేరాలు గట్టుకుని రమ్మంటే వెళ్ళేవారుగారు! ఆళ్ళొచ్చి సేతులు కట్టుకుని నిలబడాల్సిందే అనేవారు! వాళ్ళు పౌరుషమా ప్రాణమా అంటే ప్రాణం వదిలేసేవారు.

ఈ రాజ్యాన్నేలిన కడపటి రాజుకి నలుగురు తమ్ముళ్ళు. ఆ అయిదుగురిదీ ఒకటే మాట. ఒకటే బాట. పెద్ద రాజుకి ముగ్గురు కొడుకులు. ఆ వంశంలో ఏడు తరాల బట్టి ఆడపిల్ల లేదు. ఆ రాజులందరికీ మగపిల్లలే! రాజూ రాణీ నోయని నోముల్లేవు! పట్టని వ్రతం లేదు. కొలవని దేవుడు లేడు.

సివరికి దేవుడు సల్లగా చూసాడు. ముగ్గురు మగబిడ్డల తర్వాత వాళ్ళ కడుపున ఓ సిన్నది పుట్టింది. ఆ రోజే ఓ జంగందేవర వచ్చి కోట గుమ్మం ముందు నిలబడి జోస్యం చెప్పాడు.

"ఈ సిన్నది ఆదిశక్తి మీరు చల్లగా చూసారా – మిమ్మల్ని చల్లగా చూస్తుంది. మీ ఊరికి దశ పట్టుకుంటుంది. మీరు కోపం తెప్పించారా – ఊరు దిబ్బయిపోతుంది" అని

చెప్పొట్ట.

పెద్దరాజు చెవిలో ఈ మాట పడింది. రాజొచ్చి చూసేసరికి జంగందేవర కాపడలేదు. ఆ వచ్చిన దేవర శివుడే ననుకున్నారు రాజులు.

అప్పట్నుంచి ఆ సిన్నది నేల మీద పెరగలేదు. తండ్రుల గుండెల మీద పెరిగింది. వాళ్ళ మీసాలు పట్టుకుని ఆడింది. ఆ సిన్నదాని ముచ్చట్లు ఊరంతా చెప్పుకుంది. లోకమంతా చెప్పుకుంది. అన్నలు ముగ్గురూ సెల్లి సుట్టే తిరిగేవారు. అందులో ఆఖరోడికి సెల్లెలంటే వల్లమాలిన ప్రేమ.

ఆ సిన్నది పెరిగి పెద్దదయింది. బంగారబ్బొమ్మలాగుండేది. రతనాల కొమ్మలాగుండేది. ఇంతకో కన్నుండేది. సిన్న నవ్వు నవ్వేది. ఆ సిన్నదాని సొగసు సెప్పనలవి కాదు.

ఈ గడ్డకి ఎగువున ఓ రాజ్యముండేది. ఈ ఊరు గెడ్డ యివతల కొచ్చుయినా మిగిలింది. ఆ రాజ్యం దిక్కూ దిబాసీ లేకుండాపోయింది. అదో శనిగొట్టు దేశం! ఆళ్ళో శనిగొట్టు మనుషులు. ఆ రాజులు పేరుకే రాజులు. ఆళ్ళకి మానం లేదు. అభిమానం లేదు.

పరాసు దొరలొచ్చి డేరాలు ఏసుకుని రాజులిద్దరికీ కవురంపారట. ఆ బురదరాజు ఎల్లి సెయ్యి గట్టుకుని తలొంచుకుని నిలబడ్డాడు. పరాసు దొర సయ్యిమని లేచాడు. ఆ రాజు రాలేదేం - అని గంతులేసాడు. 'అరు రారు బాబయ్యా! ఎల్తే మనమే ఎల్లాలి' తెగేసి చెప్పేట్ట దుబాసి.

బురదరాజునలాగే నించోబెట్టాడు.

"ఏమయ్యా రాజా! నువ్విన్నాళ్ళూ కప్పం గట్టలేదు. ఎందుకని?" - దొర ఉరిమి ఉరిమి అడిగాడు.

"నాకు కట్టాలనే ఉంది. మా భూములు పండడం లేదు. పండినపుడు ఈ గెడ్డ దిగువ రాజులు వచ్చి కోసుకుపోతున్నారు. మా రాజ్యంలో కొచ్చి మా పశువుల్ని తోలుకుపోతున్నారు" అన్నాడు రాజు.

ఆ చాడీలు విని దొర అగ్గి మీద గుగ్గిలమయిపోయాడు. చూడా రాజునేం చేస్తానో - అన్నాడు.

దానికా బురదరాజు వద్దన్నాడు - "దొరా! ఆ రాజుకి ఓ కూతురుంది. ఆ సిన్నదాన్ని నా కొడుక్కి పెళ్ళి జేయించు. నా దశ తిరుగుతుంది. ఆ రాజులొచ్చి మా పంటల్ని కోసుకుపోరు. పశువుల్ని తోలుకుపోరు. ఆళ్ళెట్టే చీరా సారీ చాలు నీకు పదేళ్ళ కప్పానికి సరిపోతుంది" అన్నాడు.

దొర బావుందన్నాడు.

తిన్నగా ఈ వూరు వచ్చాడు. పెద్ద రాజు కొలువు దీరున్నాడు. ఆ లోగిలీ, ఆ కోటా,

ఆ వైభోగం జూసి దొర కుళ్ళిపోయాడు. యిలాంటి కోట మా దేశాన లేదు - అనుకున్నాడు.

కొలువుదీరున్న రాజు ముందు నిలబడ్డాడు దొర.

"నీకేంగావాలి దొరా" అన్నాడు రాజు.

కప్పంగావాలన్నాడు దొర.

ఎందుకు గట్టాలన్నాడు రాజు.

ఫర్మానా ఉందన్నాడు దొర. మేం గెలిచాం - మీ నవాబు మాకు యిచ్చాడు - అన్నాడు దొర.

ముగ్గురు కొడుకులూ, నలుగురు తమ్ముళ్ళూ విచ్చు కత్తులు దూసారు. మాలో ఒక్కణ్ణి ఎంచుకో! గెలువు! కప్పం పట్టుకుపో - అన్నారు. దొర వణికిపోయాడు.

చేతులు జోడించాడు దొర. నువ్వు నాకు కప్పం గట్టకపోతే మా రాజుకి నా తల యిచ్చుకోవాలన్నాడు.

పెద్దరాజు ధర్మరాజు. తమ్ముళ్ళని తగదన్నాడు. 'మన యింటి కొచ్చాడు. చేతులు జాచి అడిగాడు. మనం కత్తులు తియ్యకూడదు' అన్నాడు రాజు. తమ్ములూ, కొడుకులూ తలలొంచారు.

"నువ్వు కప్పం అడిగావు. మేం కట్టం అన్నాడు రాజు. మరేదయినా అడగమన్నాడు రాజు. దొరకి విందు జేసాడు రాజు. ఆటగత్తెలు ఆడారు. రాజు పదును కనిపెట్టాడు దొర. మనసులో మాట చెప్పాడు.

"నువ్వూ ఆ రాజూ నెయ్యమందండి. ఆరికి ఒక్కడే కొడుకు. నీకు ఒక్కతే కూతురు" అన్నాడు దొర.

సరేనంటే సరే నన్నాడు రాజు.

తమ్ములు గునిసారు. 'అళ్ళుత్త బురద రాజులు అన్నా!' అన్నారు.

మాటయిపోయిందన్నాడు రాజు.

ఆ రోజు ఊళ్ళో కుక్కలు ఏడిచాయి. పొలాల్లో నక్కలు కూసాయి. ఊరి మీద రాబందులు పొరాడాయి. ఊళ్ళో పాడెలు లేచాయి.

సిన్నది మాత్రం సిన్న నవ్వు నవ్వింది.

నువ్వూ నేనూ ఎవరమే - పైనున్న శివుడు చెపుతాడు - నా దేవత చెపుతుంది - అదే జరుగుతుంది - అంది సిన్నది.

దగ్గరుండి పెళ్ళి జరిపించాడు దొర.

రెండు రాజ్యాల ప్రజలూ కలగలిసిపోయారు. ఏటపోతుల మీద ఏటపోతులు తెగాయి. నెల రోజుల పాటు రెండు రాజ్యాల ప్రజలూ కలగలసిపోయారు. దేవిడీలోనే తిన్నారు.

చేటలంత అరిసెలు. కొబ్బరి బొండాల్లాంటి మిఠాయిలు! తిన్నంత తినమన్నారు. పట్టుకెళ్ళినంత పట్టుకెల్లమన్నారు.

పెళ్ళికొడుకు తాటిసెట్టులాగున్నాడు. మీసాలు పెరిగి, కండలు తిరిగీ పులిలా ఉన్నాడు. సిన్నది మేకలా ఉంది. సూసినాళ్ళంతా ముక్కున వేలేసుకున్నారు. అన్నన్నా యిదేం పని చేసావు రాజా – అనుకున్నారు.

ఆ తల్లికి ముఖంలో నవ్వు సెదరలేదు. అన్నలకి మొక్కింది. తండ్రులకూ మొక్కింది. తల్లులకూ మొక్కింది. దాసీ వాళ్ళకి కానుకలు యిచ్చింది. కాపలా వాళ్ళకి కాసులు యిచ్చింది. మేనా ఎక్కింది.

కాపురానికి వెళ్ళిపోయింది సిన్నది.

వీరు పెట్టిన సారెలు పెట్టుకోటానికి ఆరింట్లో చోటు లేకపోయింది. గడ్డమ్మట యిక్కడ నుంచి అక్కడి దాకా బళ్ళే! సారెలు నిండిన కావిళ్ళే!

ఆ రాజ్యం కబురు యిక్కడకి రానివ్వలేదు బురదరాజు. రోజులు గడుస్తున్నాయి. ఏడాదయింది.

ఉండబట్టలేక పోయారు అన్నలు.

ఆఖరాడికి కల్యాణం తలపెట్టాడు రాజు.

పిలుపూ అవుతుంది. సెల్లినీ తీసుకొస్తామన్నారు అన్నలు. వెళ్ళమన్నారు తండ్రులు. వెళ్ళారు అన్నలు.

కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళిచ్చింది చెల్లి.

నోరు విప్పేదాకా అన్నలకి నమ్మకం కలగలేదు. ఆళ్ళ రాజ్యాన సెల్లిగాదిది. మాయల మరాటీ గుహలో బాలనాగమ్మ లాగుంది ఆ సిన్నది. సంగులా ఉంది అత్తగారు.

'ఎందుకమ్మా అలా ఉన్నావు' అని అడిగారు అన్నలు. 'అలా అయిపోయావేంటమ్మా' అని కళ్ళ నీళ్ళెట్టుకున్నారు. 'కట్టుకున్నాను – కాపురానికొచ్చాను' – ఎప్పుడూ ఒకలాగే ఉంటానా – అన్నలూ' అంది సెల్లి.

బావని వేళాకోళం చేసారు బావమరుదులు. మాకు అల్లుణ్ణెప్పుడిస్తావు బావా – అన్నారు. ఆ మాటకి బావ ముహం తెలతెల పోయింది. మీ సెల్లినే అడగండన్నాడు బావ. అక్కడి నుంచి లేచ్చక్కాపోయాడు.

అవమానాన్ని దిగమింగుకున్నారు అన్నలు. తెచ్చినవన్నీ చెల్లికి యిచ్చారు. చెప్పాల్సినవన్నీ చెప్పారు. బురదరాజు ముందర నిలబడ్డారు. పెళ్ళి సంగతి చెప్పారు. మీరూ మీ పరివారమూ రండన్నారు. సెల్లెల్నీ బావనీ పంపండన్నారు.

అలాగేనన్నాడు మామ.

అన్నమాట మీద నిలబడ్డాడు. కొడుకునీ, కోడల్నీ పంపాడు. మేనా దిగింది సిన్నది. ఊరంతా బెంగెట్టుకుపోయింది. కన్నతల్లి కూతుర్ని చుట్టేసుకుంది. తల్లీ పిల్లా ఒక్కటయిపోయారు. వంద అడిగింది తల్లి. ఒక్కటీ చెప్పలేదు పిల్ల.

పెళ్ళి ఆడావుడిలో ఉన్నారు జనం. ఆ సందంట్లోనే యింకా నెల తప్పలేదా - అన్నారు ఆడంగులు. సిన్నది చిక్కినా సిరునవ్వలాగే ఉంది.

ఆ దాసీలూ, యీ దాసీలూ కలిసారు. మాటలు కలిశాయి. గుట్టు రట్టయింది. అత్తింటి ఆరళ్ళు బయట పడ్డాయి.

ఆ నిలువెత్తు మగాడికీ మగసిరి లేదంట. సిన్నప్పుడే రాచవైద్యులు చూసారుట. మందులు వాడారట! గుణం యివ్వలేదుట! అమ్మా అయ్యా కొడుకు గుట్టు కప్పెట్టారు. పెళ్ళి చేశారు.

సిన్నదాన్ని పన్నెత్తి పలకరించలేదుట పెనిమిటి. కన్నెత్తి సూడలేదుట పెనిమిటి. ఆ తల్లి సీతమ్మ తల్లిలా అన్నీ కడుపులో పెట్టుకుంది.

కన్నతల్లితో కూడా సెప్పుకోలేదు. తన దేవతతోనయినా చెప్పుకుందో లేదో! అందర్నీ దయగానే చూసింది. ఎవ్వరినీ నెపం పెట్టలేదు.

అయినా ఆ తల్లి కష్టాలు గట్టెక్కలేదు.

రాత్రిళ్ళు ఆ సిన్నది పడుకున్న గదిలోకి ఎవరో వచ్చేవారుట. మాయల మరాటీలా మీద కొస్తుంటే కెవ్వుమందిట సిన్నది. పరుగు పరుగున పోయి అత్తగారితో చెప్పుకుందిట.

ఎవరూ రాలేదందిట అత్త. 'దాసీలున్నారు. కాపలా వాళ్ళున్నారు. మనుషులెవరొస్తారే' అందిట. 'వచ్చివాళ్ళు దేవుళ్ళయితే నువ్వూ నేనూ ఆపలేం' - అందిట. నీ కడుపున కాయ గాయలేదని నేను మొక్కుకుంటున్నానందిట - ఏ దేవతలో దయ జూసారందిట.

అత్తగారి మాటలు విని విని ఆదలిపోయిందట కోడలు. తన దేవతకు నోములు నోస్తూ తలుపులు మూసుకుని బతుకుతోందిట. రాత్రిళ్ళు తలుపు తట్టడం తియ్యమనడం - ఆ సిన్నది తియ్యపోవడం - జరుగుతూనే ఉన్నాయిట.

ఎవరే ఆ తలుపు తట్టేవాళ్ళు - అన్నారు వీళ్ళు. బురదరాజేనని తేల్చారు వాళ్ళు. విన్నవాళ్ళు ముక్కున వేలేసుకున్నారు. కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

గుట్టల్లా రట్టయింది.

ఆ కబురు అక్కడ ఆగలేదు.

పెళ్ళిపీటల మీంచి వొచ్చి బట్టలు మార్చుకుంటున్న కడగొట్టు అన్నకి తెలిసింది. అంతే! బాకు దూసాడు అన్న. బాకు దూసాడు బావ. బాకులు దూసారు అటూ యిటూ జనం.

పెళ్ళి మండపం రక్తకొల్లయిపోయింది. శవాలు గుట్టలు గుట్టలయ్యాయి. రెండు రాజ్యాల జనమూ కలబడ్డారు. ఎవ్వరూ మిగలలేదు. రెండు పట్టణాలూ ధ్వంసమయి పోయాయి. ఇద్దరు రాజులూ బుగ్గయిపోయారు. రెండు వంశాలూ అంతరించి పోయాయి.

అంతా నాశనం చేసిన తల్లిని జనం అడిగారు. 'తల్లీ, నిన్ను ఆరళ్ళు పెట్టింది నీ అత్తింటాళ్ళు. కన్నింటాళ్ళని కూడా ఎందుకు పొట్టని బెట్టుకున్నావు?' అన్నారు.

ఆ తల్లి ఉగ్రరూపమెత్తేసింది.

ఊరికి శాపం పెట్టింది.

"పెళ్ళి చేసి కూతురిని సాగనంపేసి, చచ్చిపోయిందనుకోవడం పాపంగాదా?" అంది.

"అవును తల్లీ అవును - మమ్మల్ని రక్షించు" అన్నారు.

'యిక్కడినించి యీ వూరి వాళ్ళు మూడు పండుగలకి కూతుళ్ళనీ, అల్లుళ్ళనీ తీసుకురావాలి. సంక్రాంతి, ఉగాది, అట్లతద్దీనూ! ఏడాదిలోగా పిల్లలు పుట్టని దంపతులని విడదీసెయ్యాలి. లేకపోతే ఆ తల్లిదండ్రులు రక్తం గక్కుకుని ఏడాత్తిరక్కుండా చస్తారు" అనేసి ఆ తల్లి దేవతలో కలిసిపోయింది. ఆ దేవత గుడి ముందే యీ తల్లి దేవతగా వెలిసింది. కావాలంటే వచ్చి సూడు అబ్బాయా!" అన్నాడు వేమన తండ్రి.

మర్నాడే పంచాయితీ! ఆ తెగ పెద్దలూ, యీ తెగ పెద్దలూ కలుస్తారు. ఎవరు పెట్టినవి వాళ్లకి యిప్పించేస్తారుట. భార్యాభర్తలని విడదీసేస్తారుట!

నేను ఆయనకి చాలా రకాలుగా చెప్పాను. ఆయనది మూఢనమ్మకం అన్నాను. పిల్లలు పుట్టక పోవడానికి వంద కారణాలున్నాయన్నాను. డాక్టర్లు ఎన్నో లోపాలు సరిచేస్తారన్నాను. వేమనా భార్యా యిద్దరూ ఆరోగ్యవంతులేనన్నాను. డాక్టర్లు పరీక్షలన్నీ చేసారన్నాను. మీకు ఏమీ అవదు నాదీ హామీ అన్నాను.

అన్నీ విన్నాడు.

"అబ్బాయా! మీరు పట్నాల్లో ఉన్నారు. మీరేటేటో సెపుతారు. మా భయాలు మాయి. మా కట్టుబాట్లు మాయి. మా తెగ పెద్దలు సెప్పినట్టే మేం నడుస్తాం! నువ్వా యిక్కడ పుడితే మాలాగే సేస్తావు" అన్నాడు.

వేమనా, భార్యా విడిపోటం తప్పదన్నాడు. తెగ పెద్దల మాట తల తెగినా దాటనన్నాడు.

"తెగ పెద్దలే చెపితేనో?" అన్నాను.

ఆళ్ళు సెప్పింది యింటానన్నాడు. మర్నాడు పంచాయితీలో చెప్పుకోమన్నాడు.

నాకు పక్క ఏర్పాట్లు చూసారు.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

వేమన తండ్రి చెప్పిన కథ చరిత్రకి నిలవదు. పురాణాలతో కలవదు. సంబద్ధతకి

అతకదు. అలా చెబుదామంటే నాలాంటి వాళ్ళ భాషకీ, భావనకీ లొంగదు. అలాంటివి ఎలా పుడాతాయో తెలీదు. పుట్టించిన వాళ్ళు ఉద్దేశ్యపూర్వకంగా చేసారో కాదో తెలీదు.

కానీ-

ఆ మూఢనమ్మకంలో ఓ సత్యముంది. ఆడపిల్లలకి ఓ రక్షణ నిస్తుంది ఆ నమ్మకం. వైద్యం యింతగా ఎదగని రోజులలో ఆ నమ్మకం ఒక రకమయిన చికిత్సే గదా! దానివల్ల కొన్ని జంటలు బాధపడి కూడా ఉండవచ్చు. కొన్ని నష్టాలు కలిగుండవచ్చు. ఏ చికిత్సా, ఏ విధానమూ ఫూల్‌ప్రూఫ్ కావు గదా!

ఎంత విచిత్రాల దేశమిది! ఎన్ని విచిత్రాల దేశమిది! దీనికి దీని సమస్యలుండవచ్చు. చరిత్రలో ఆ సమస్యల కోసం చేసిన పరిష్కారాలే తర్వాత కాలంలో సమస్యలు రేపవచ్చు!

ఇప్పుడలాంటి సమస్యే నా ముందుంది.

పిల్లలు పుట్టనీ, పుట్టకపోనీ కలిసుండాలనుంది వేనమకూ, భార్యకూ! వేమన తండ్రికీ అంత గట్టిగా నమ్మకం లేదుగానీ తెగ కట్టుబాటుని ఎదురించి బ్రతకాలని లేదు.

నేను ఏం చేయాలి?

మరుసటి రోజు తెగ పెద్దలు కూడారు. నేనూ వెళ్ళాను. వాళ్ళు నేను చెప్పినదంతా విన్నారు. లోగడ యిలాంటి తగువు వచ్చిందా అని తిరగదోడుకున్నారు.

మూడు నెలలు గడువు పెంచారు.

వాళ్ళు విధించిన అపరాధాన్ని వేమన కట్టాడు.

మమ్మల్ని సాగనంపారు వాళ్ళు.

మేం తిరుగు ప్రయాణం ఆరంభించాం

నా మనసు మాత్రం ముందుకు పోతూనే ఉంది.

వేమనకూ, భార్యకీ పిల్లలు పుడతారో లేదో కాలమే చెప్పాలి. వాళ్ళకి యిదెంత మూఢనమ్మకమో, వాళ్ళెంత స్వతంత్రులో యీ మూడు నెలల గడువులోనూ నేను అర్థమయ్యేలా చేయాలి! భారతదేశంలోని మూఢనమ్మకాల నన్నింటినీ చేర్చి వాటి పుట్టుక అవసరమేమిటో, కాలమేమిటో శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి!

ప్రయణం సాగుతూనే ఉంది. ✿

---

ఈ "గడువు" కథలోని లోపాలనూ, బలాలనూ యీ కోణాల నుంచి గూడా విశ్లేషించండి:

(1) పాపులర్ విశ్వాసాలకు ఒకప్పటి సాంఘిక పరిస్థితులు కారణం (2) భాష.

- రచయిత

## కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

"గడువు" కథ చాలామందికి రకరకాల కారణాల వలన నచ్చింది. కొందరికి కొన్ని కారణాల వలన నచ్చలేదు.

నచ్చని వారికి –

వేమన సమస్యని 'కథ చెప్పే పాత్ర' పరిష్కరించకపోవటం ఓ కారణం. దానివల్ల – కథకి 'అయిదోతన'మయిన లక్ష్యశుద్ధి లోపించిందన్నారు. వేమన దంపతులు కట్టుబాట్లను ఎదిరించపోవటం తప్పన్నారు.

నచ్చిన వారికి –

ఈనాటి 'మూఢనమ్మకాల'కు ఒకనాటి సామాజిక అవసరమే కారణమని కథ కట్టడం

నచ్చింది. కథలో సమస్యకి పరిష్కారం చూపకపోయినా, దాని గూర్చి ఆలోచింప చేయటమూ, భవిష్యత్తు మీద హోప్ పుట్టించటం వల్ల నచ్చిందన్నారు. కథనం ఆకట్టుకుం దని ఎక్కువమంది అన్నారు. స్త్రీ సమస్యలను అన్ని కోణాల నుంచి చూసి ఈ శీర్షికలో వరుసగా రాస్తున్నట్లు కొందరి అభిప్రాయం.

పోతే -

కథలో పాత్రలు తమ సమస్యలను 'వీరోచితంగా' ఎదుర్కోవాలని చాలామంది ఆశిస్తారు. వాస్తవ జీవితంలో వ్యక్తులు తమ 'మానసిక స్వభావాల'నూ, 'సాంఘిక సంబంధాల'నూ 'అవగాహన స్థాయి'నీ బట్టి తమ తమ సమస్యలను పరిష్కరించుకుంటారు. ప్రవర్తిస్తారు. ఆ ప్రవర్తనే కథలో మలిచితే అది 'పాత్రోచిత ప్రవర్తన' అవుతుంది. 'వీరోచిత ప్రవర్తన' అరుదు. అలాంటి అరుదైన పాత్రలను స్వీకరించాలి. వాటితో సమస్యలను పరిష్కరించాలి. అప్పుడు ఆ 'పాత్రలూ', 'పరిష్కారాలూ' ఆదర్శప్రాయం కావచ్చు. అనుసరణీయం కావచ్చు. అది సాహిత్యానికీ ఒక లక్షణమూ, లక్ష్యమూ కావచ్చు.

అయితే -

సమస్యలు సాకల్యంగా తెలిస్తే పాఠకుడి అవగాహన స్థాయి పెరుగుతుంది. నిజ జీవిత సమస్యలను మరో కోణం నుంచి చూడగలుగుతారు - ఇలా భావించే రచయిత పాత్రోచిత ప్రవర్తనను సాధనంగా తీసుకుంటాడు. పాఠకునిలో 'ఆలోచన'నో 'ఆవేశా'న్నో రగల్చటానికి ఒక్కోమారు అసంతృప్తినిచ్చే ముగింపుని వాడతాడు. ఈ పద్ధతిలో కథలో పాత్రల వీరోచిత ప్రవర్తన కన్న, పాఠకుల నిజ జీవితంలో వీరోచిత ప్రవర్తన లక్ష్యంగా పెట్టుకుంటాడు రచయిత. అది సిద్ధించటమూ, సిద్ధించక పోవటమే ఆ కథకి సాఫల్య వైఫల్యాలు!

ఈ సందర్భంగా -

ఈ మధ్యనే 'చతుర'లో వెలువడిన సి. వసంతగారి 'విముక్తి' నవలను గుర్తు చేసుకుందాం! సంతముచ్చులు అనే తెగ గురించి మరాఠీలో వెలువడిన ఆత్మకథ మీద ఆధారపడిన నవల అది. చదువుకుని, యూనియన్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి కూడా తెగ కట్టుబాట్లను దాటలేకపోతాడు. వ్యక్తుల మీద కట్టుబాట్లు ఎంత బలంగా ఉంటాయో చదువుతుంటే ఆశ్చర్యం కలుగుతుంది! అవగతమవుతుంది! వాటిపై కోపం వస్తుంది.

'నచ్చిన అంశం'లో యస్.కె. మహాలక్ష్మి (పార్వతీపురం) ప్రథమ బహుమతి; రవిచంద్ర (దాచేపల్లి) ద్వితీయ బహుమతి పొందారు.

'నచ్చని అంశం'లో పి.ఎస్.చారి (విశాఖపట్నం) ప్రథమ బహుమతి; బమ్మిడి సరోజిని (కాశీబుగ్గ) ద్వితీయ బహుమతి పొందారు.

మెచ్చిన అంశం

## ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

ఈ నెల 'గడువు' కథ చదువుతూ ఉంటే రచయిత గారి కథా కథనం లేక కథ చెప్పే తీరు నన్ను బాగా ఆకట్టుకొంది. వేమన వచ్చి కాళ్ళ మీద పడ్డాడు, మామూలే – మాట్లాడడు, అంటూ గిరిజనుల మితభాషిత్వాన్ని చక్కగా వ్యక్తపరిచారు. అయితే సాంఘికమైన ఈనాటి కథ చదువుతున్నామో, పాతకాలంనాటి జానపద సాహిత్యాన్ని చదువుతున్నామో లేక పరాసు దొరల ప్రాబల్యం గల చరిత్ర నెమరు వేస్తున్నామో తెలియకుండా కలగాపులగం చేస్తూ రచన సాగింది. అయినా సరే ప్రతిభావంతులైన రచయితగారు మాత్రం కథాగమనంలో ఎక్కడా అవరోధం లేకుండా కథా రచన సాగించారు. ఈ కథ "గడువు" అనే శీర్షిక పాఠకుల్ని కథ చదవటానికి పురికొల్పుతుంది.

పిల్లలు పుట్టని కారణంగా దంపతులను విడదీసే గిరిజనుల ఆచారము, ఆ ఆచారానికి ఆధారమైన కథా, అన్నింటినీ మించి తెగ పెద్దల నిర్ణయానికి తలవంచే వేమనా, వేమన తండ్రి వంటి అమాయక గిరిజనుల మనుసుల్లో న్యాయవ్యవస్థపై ఉండే గౌరవమూ ఈ కథకి ఒక పట్టు బలాన్నిచ్చాయి. ఈనాటికీ సమాజాన్ని మూఢనమ్మకాలు ఓ ఊపు ఊపుతున్నాయనే విషయాన్ని చక్కగా చెప్పారు. ఇందుకోసం రచయితగారు ఎన్నుకున్న కథ కన్నా కూడా శాపకారణాన్ని వేమన్న తండ్రి చేత చెప్పించిన తీరు చాలా బాగుంది. కథా రచనలోని అంశం "మూఢనమ్మకాలు – వాటి ప్రభావం, అందుకు దోహదపడే వాతావరణం" – ఇవన్నీ చక్కగా సరిపోయాయి. వేమన దంపతులకి పిల్లలు పుడతారని ఆఖరికి 3 నెలల 'గడువు'ని సాధించారు. తాత్కాలికంగా ఉపశమనం కలుగుతుంది.

ఇంక అసలు కథకి కారణమైన కథలో కథయిన రాజు కూతురు శాపం పెట్టి దేవతలో కలిసిపోవటం, నిజానికి ఇది నేటికీ కొందరు ఆడపిల్లలకి ఎదురయ్యే సమస్య. (ఏ ఒక్కరికయినా సరే విచారించదగినదేమో). దీన్ని సమస్య అనే కంటే నేటి సమాజంలో పేడి కుమారుడికైనా పెళ్ళి చెయ్యాలనే పెద్దల దౌర్భాగ్యపుటాలోచన అంటే సరిపోతుందేమో! పేడి కొడుక్కి పెళ్ళి చేసి ఆడకూతురిపై (కోడలయినా) అఘాయిత్యం చేసే మామలు, బావలూ ఇంకా ఉన్నారు. "కథా విషయం పాతదయినా సమస్య మాత్రం తాజాగానే ఉంది". తన భర్త మగాడు కాదు అని ఏ కూతురూ కన్నతల్లితో కూడా చెప్పుకోలేదు. జరిగిపోయిన దాన్ని తన దేవతతో చెప్పినా ప్రయోజనం లేదు. ఈ విషయం రచయిత ఇలా చెప్పారు – "కన్నతల్లితో కూడా చెప్పుకోలేదు. తన దేవతతో నయినా చెప్పిందో లేదో! ప్రయాణం సాగుతూనే ఉం"దని సమస్యలకీ, మూఢాచారాలకీ ఈ వ్యవస్థలో

పుల్‌స్టాప్ ఇంకా లేదనీ తన ఆవేదనతో కథని ముగింపు చేయటం కూడా చాల బాగుంది.

- యస్.కె. మహాలక్ష్మి

ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

'గడువు!' - కథ బావుంది.

రచన ముఖచిత్రమై వెలిసిన తీరు నచ్చింది. 'గడువు' అని పేరుంచటం మరింత బాగుంది.

వుద్యోగం తీసేస్తారన్నా 'కల్లు తాగటం' మాననటం 'వేమన్న వేదం'లా ఉంది.

పెళ్ళి చేసిన పెద్దలే విడదీయటం వింతగా వుంది. దేవత శాపమనటం మరీ ఆశ్చర్యంగా వుంది. ఏడాది లోపల పిల్లలు పుట్టాలి - కనీసం నెలయినా తప్పాలి?! మాకూ నవ్వొచ్చింది. మాకూ ఆశ్చర్యం కలిగింది. తరతరాలుగా స్త్రీని పురుషుడు అణగదొక్కేడు. ఆచారాల పేరున, పాతివ్రత్యాల పేరున స్త్రీని బానిసను చేసుకున్నాడు. పురుషుడు దేవుని తరువాత దేవుడయ్యాడు. తనకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించలేని స్త్రీ వంటింటికీ, పడకటింటికీ పరిమితమయింది. కొంతవరకూ పడకలోనైనా స్త్రీ కొంత ఆదరణ పొందుతుంది. కొన్నిసార్లు అదీ లుప్తమౌతుంది. స్త్రీ పడకటింటి సుఖం మీద వ్రాసిన 'గడువు'లోని సమస్య ఆలోచన రేకెత్తించేదిగా వుంది. వైద్యం ఎదగని రోజులలో చికిత్సగా ఆ విశ్వాసం పాపులర్ అయినా రచయిత చెప్పినట్లు యిప్పుడది మూఢవిశ్వాసం. అయినప్పటికీ ఎప్పుడు ఎంతమంది స్త్రీలు (?) స్వేచ్ఛగా తమ భావాలను వెల్లడి చేయగలుగుతున్నారు? వరుని యొక్క అర్హతలు ఆసాంతం తెలీకుండానే 'పెళ్ళి చేసి పిల్లను' అత్తవారింటికి పంపించటంతో చేతులు దులుపుకుంటున్న తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో మార్పు ఎంతవరకూ వచ్చింది? తాగుబోతయినా, తిరుగుబోతయినా సమర్ధించుకోమంటున్న వారి బాధ్యతారాహిత్యం యిప్పటికీ స్త్రీలను సంశయంలో పడవేస్తుంది. భర్తని హృదయం అంతటితోనూ ప్రేమించలేకపోవటమే కాక చివరికి శరీరాన్ని అర్పించుకోవటనికి కూడా అతడికి అర్హత లేకుంటే ఆ స్త్రీ దిక్కుతోచని పరిస్థితుల్లో అడ్డదారి తొక్కే అవకాశం ఉండి - తొక్కలేని పరిస్థితులు వుంటే ఒకానొక పశుతుల్యమైన స్థితిలో జీవితాన్ని చంపుకుంటుంది. స్త్రీ లైంగిక స్వేచ్ఛ గురించి 'చలం' తన పుస్తకాల్లో విస్తృతంగా వ్రాసేడు. తన భావ ప్రకటనల్లో స్త్రీ మార్గం రంగనాయకమ్మ చాలా వరకు నిర్దేశించారు. ఫెమినిస్టులు మరో అడుగు ముందుకేసి మూడు తరాలకీ వారధి కట్టేరు. ఒక్కో కాలానికీ, ఒక్కో సమస్యకీ ఒక్కో రకమైన 'సొల్యూషన్' వుంటుంది. స్త్రీల బాగోగులు చూడడానికి పుట్టింటి వారు మూడు పండుగలకీ యిళ్ళకి పిలవాలని నిర్దేశించిన సిన్నది - మూడు పండుగలకి పుట్టింటి వారు పడే ఆగచాట్లు అపుడూహించలేదు. బురదరాజు

తాడిచెట్టు కొడుక్కిచ్చి బంగారబ్బొమ్మ, రతనాల కొమ్మ, సోగ కన్నుల, సిన్న నవ్వుల సిన్నదాన్నిచ్చి చేసేటప్పుడు ఆమె అభిమతమూ, సమ్మతి తెల్సుకోకుండా ధర్మరాజు తప్పే చేసేడు. గురజాడ పూర్ణమ్మ ఒకందుకు బలైపోయింది. సిన్నది మరొందుకు ఆహుతైపోయింది. చలం పద్మావతి ఇంకోరకంగా బాధపడింది. చిన వీరభద్రుని సర్వమంగళ కన్నీళ్ళల్లో మునిగిపోయింది. యేయే కాలాలకు చెందిన స్త్రీ ఆయా కాలాలకు చెందిన పురుషుల చేతుల్లో బొమ్మలైనారు. మగవాడి మొరటు శిలాగృహానికి వన్నె తెచ్చే పాలరాతి బొమ్మలైనారు. ద్వంద్వనీతి పోయి స్త్రీ పురుష సమానత్వమూ, ఆర్థిక సమానత్వమూ రావటానికి గడువు పడుతుంది. వేమనకు, భార్యకీ పిల్లలు పుడతారో లేదో కాలమే చెపుతుంది.

ప్రయాణం సాగుతూనే ఉంటుంది. ఇప్పటి పాపులర్ విశ్వాసాలు ఒకప్పటికి మూఢ విశ్వాసాలుగా ప్రయాణం సాగుతూనే ఉంటుంది. స్త్రీ పురుష సమానత్వంతో, ఆర్థిక సమానత్వంతోమానవులు పరిపూర్ణులయేంత వరకూ ప్రయాణం సాగుతూనే ఉంటుంది. దానికి గడువు లేదు!

ముఖ్యంగా ఈ కథలో శైలి - ఈ కథకు ఖచ్చితమైన శైలి. రచయిత నైపుణ్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించకుండా వుండలేం. ముఖచిత్రంతో సత్కరించిన 'రచన' అభినందన పాత్రమౌతుంది. 'గడువు' నిజంగా సాహిత్యంలో 'వామనుని అడుగు!'

– రవిచంద్ర

నచ్చని అంశం

ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

'గడువు' కథలో రచయిత 'తెగ'లో నున్న కట్టుబాట్లుకు తగిన పరిష్కారం సూచించలేక పోయారు. మరియు ఒక సందర్భంలో ఆ కట్టుబాట్లను సమర్థించారు కూడా. ఈ విషయం నాకు బొత్తిగా నచ్చలేదు.

వేమనను, అతని భార్యను తీసుకొని పెద్దల దగ్గరకు వెళ్ళినప్పుడు ఆ పెద్దల సమక్షంలో వారి తెగలోనున్న కట్టుబాట్ల వలన వారు ఎంత నష్టపోతున్నారో నాగరికుడిగా (రచయిత' చెప్పిన బావుండును.

ఇకపోతే కథ మధ్యలో అంతా చందమామలో పిల్లలు చదువుకునే రాజుల కథలా ఉంది. మామూలుగా అయితే కథ పాఠకుడి చేత పూర్తిగా చదివించలేదేమోనని నా అభిప్రాయం.

నాగరికత నేర్చుకుంటున్న వేమన కూడా పెద్దలకు, కనీసం తండ్రికి నచ్చచెప్పక పోవడం ఏమీ బావుండలేదు మరియు సంవత్సరం లోపులే పిల్లలు పుట్టాలనే ఆ పెద్దల

కట్టుబాటు కూడా వీరి జంట కోసం మూడు నెలలు గడువుకోరటం అసమంజసంగా ఉంది.

- పి.యస్. చారి

### ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

'భారతదేశంలోని మూఢనమ్మకాలనన్నింటినీ చేర్చి వాటి పుట్టుక అవసరమేమిటో, కాలమేమిటో శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి!' అని 'గడువు' కథలో చివరగా చెప్పినా - ఆ వాక్యం చుట్టూరానే (కట్టు) కథ అల్లారు రచయిత. ఒక అవసరం కోసం... ఒక నియమం, కట్టుబాటు కోసం నిర్మించుకున్నా 'రాజ్యాంగపరంగా - రాతపరంగా లేని' ఆచార వ్యవహారమే మూఢనమ్మకం. ఆ మూఢనమ్మకం అప్పటి కాలానికి ఉపయోగకరంగా ఉన్నా ఇప్పటి 'మూఢనమ్మకం'గా అరిష్టమూ, అద్వైతమే!

అయితే ఎటువంటి స్ఫూర్తినీ ఇవ్వని 'గడువు' కథని రెండు భాగాలు చేయాలి. 'వేమన భార్య(?) దంపతుల్ని సంవత్సరమయినా పిల్లలు కలుగునందుకు విడిపోవాలి' అని పెద్దల మాట - ఒక భాగం. ఆ పెద్దల మాట (మూఢనమ్మకం) వెనుక కథ - రెండవ భాగం. మొదటి ప్రధాన కథా భాగం కంటే - రెండవ భాగమే కథలో ఎక్కువ వివరించబడింది. 'మూఢనమ్మకం' చెప్పినంత బలీయంగా కథ ముగింపు ఇవ్వకుండా ఒక్క వాక్యంతో వదిలేయడంతో కథ పేలవంగా తయారయింది. పైగా కథకి తలకాయ పెద్దదై, మిగతా ప్రధాన అంగాల్ని చిన్నవి చేసి వదిలినట్టు కథ స్వరూపమే అలక్ష్యంగా, అలక్షణంగా వుంది. రాతి గోడల్లోంచి మొక్కలు మొలుస్తున్న ప్రకృతి తిరుగుబాటు సత్యాన్ని మరచి; దేశ, విదేశాల్లో చరిత్ర నాటి నుంచి నేటి వరకు అణచివేతని ఎదుర్కొనే ధోరణిలో... ఈ ఇరవయ్యో దశాబ్ది చివరి దశలో కూడా కనీసం ప్రధాన పాత్రధారులయిన వేమన దంపతులు ఎదిరించకుండా అపరాధాన్ని చెల్లించడం... అదీకాక మూడు నెలల 'గడువు'లోనూ వాళ్ళెంతా స్వతంత్రులో 'అర్థమయ్యేలా చేయాలి' అని రచయిత అనుకుంటే సరిపోయిందా? లేక కథకి పేజీల నిబంధన ఏమైనా పెట్టుకున్నారా? చెప్పవలసిన చోట వదిలేసి - ప్రధాన అంశాన్ని వదిలి - అవసరం లేనిదాన్ని కన్నా ఎక్కువ చెప్పటం మూఢ నమ్మకం వెనుక కథని వివరించడం రచయిత కథా 'ప్రయాణం'లో పట్టాలు తప్పినట్టే. శ్రీ తాపీ ధర్మారావు లాంటి ప్రముఖులు 'మూఢనమ్మకాల వెనుక చరిత్రని' వ్యాసాలుగా చెప్పారే కాని - ఇలా కథగా రాయాలని ప్రయత్నించలేదు. మూఢనమ్మకాల్ని కథగా మలిచి ఒకటో రెండో సత్యవాక్కుల్ని విసిరి పాఠకుల్ని కంగారు పెట్టవద్దు. 'కథాప్రహేళిక' పేరు పెట్టి - ఇలాంటి కథలతో 'గేలి' చేసిన 'రచన'లో పేజీలు 'కేళి' ఖాళీ చేయడం సబబు కాదు.

- బమ్మిడి సరోజిని